క్లుప్తంగా

కీలకపాత్ర పోషించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న యువజన విభాగం నాయకుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: ప్రజల అభివృద్ధే అభిమతంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు యువజన, విద్యార్థి విభాగాలు కీలకపాత్ర పోషించాలని ఆ పార్టీ యువజన విభాగం నాయకుడు జి. ఈశ్వర్ కౌశిక్ పిలుపునిచ్చారు. నగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలో యువజన, విద్యార్థి విభాగ నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా నూతన సంస్కరణలతో పారదర్శక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ విధి, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ ఆర్‌కే, యువజన విభాగం అధ్యక్షుడు కె.సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



ఆకట్టుకున్న గిరిజనుల వేషధారణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో గణపతి నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, అమ్మవారి వేషధారణలు, యువత డీజే డాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 విజేతకు అభినందన



పావనిని అభినందిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన కెల్ల ఉదయపావని ఇటీవల గ్రూప్-1లో సత్తా చాటి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆదివారం పావనిను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సామాన్య, మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన పావని తొలి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. నేటి యువతీ, యువకులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి రామతీర్థంలో పవిత్రోత్సవాలు



రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను దేవస్థాన అధికారులు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు పవిత్రోత్సవ పూజలకు ఆలయ అర్చకులు అంకురార్పణ చేయనున్నారు. 10న శ్రీమద్రామాయణ పారాయణాలు, సుందరకాండ పారాయణాలు, దివ్య ప్రబంధ సేవా కాలములు, యాగశాలలో అకల్మష హోమాలు, పవిత్ర శుద్ధి, పంచశయనాధివాసం, సర్వదేవతామూర్తి హోమాలు జరిపించనున్నారు. 11న ప్రత్యేక పూజలనంతరం సీతారామస్వామికి ప్రధాన ఘట్టమైన పవిత్ర సమర్పణ.. 12న శ్రీరాముడికి పట్టాభిషేకం నిర్వహిస్తామని ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు.

హిందూ ధర్మం ఆచరణీయం

శృంగవరపుకోట: హిందూ ధర్మం ఆచరణీయమైనదని ధర్మవరం బాబూరావు మాస్టారు అన్నారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా స్థానిక ధారగంగమ్మ ఆలయంలో ఆయన ఆదివారం ధార్మికోపన్యాసం చేశారు. హైందవ ధర్మం విశిష్టత, విలువలను వివరించారు. అనాది నుంచి నేటి వరకూ అందరూ ఆచరించదగ్గది హైందవధర్మమని చెప్పారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి.. మొదటి అంకం ప్రారంభం..

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి పండగకు సంబంధించిన మొదటి అంకం ప్రారంభమైంది.. దసరా తర్వాత మంగళవారం నిర్వహించనున్న పైడితల్లి పండగకు సంబంధించి సిరిమాను చెట్టును ఆదివారం గుర్తించారు. అమ్మవారు పూజరి కలలో కనబడి సిరిమాను చెట్టు ఆనవాలు చెప్పగా... పూజరి బంటుపల్లి వెంకటరావు, ఈఓ సుధారాణి, తదితరులు నెల్లిమర్ల మండలం జరజాపుపేటలో తుమ్మి అప్పారావు కళ్లంలో చెట్టును గుర్తించి ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



అమ్మవారి చెట్టుకు మొక్కుతున్న ఆలయ ఈఓ సుధారాణి



సిరిమాను చెట్టు పరిసర ప్రాంతంలో జనసందోహం



పూజ చేసేందుకు పసుపు, కుంకుమలతో ఆలయ సిబ్బంది, భక్తులు



సిరిమాను చెట్టుకు జలాభిషేకం



అమ్మవారి చెట్టుకు ప్రత్యేక హారతులిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు



చెట్టుకు పసుపు రాస్తున్న ఆలయ సిబ్బంది

హిందూ సంప్రదాయాల పరిరక్షణకే ధర్మ ప్రచారం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- రామతీర్థంలో ప్రారంభమైన ధర్మ ప్రచార వారోత్సవాలు



ఆధ్యాత్మిక ప్రవచనకర్త కృష్ణమాచార్యులకు ధర్మపథం సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



గో పూజ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు

నెల్లిమర్ల రూరల్: హిందూ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకే ఆలయాల్లో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్మ ప్రచార వారోత్సవాలను ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులకు అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా.. సీతా సమేత శ్రీరామచంద్రుడిని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద గోపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ధర్మ ప్రచారం వారోత్సవాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యకృత్యం కావాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని, ప్రచార కార్యక్రమంలో భజన కళాకారులు, ఆధ్యాత్మికవేత్తలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలన్నారు. ఎంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన రామతీర్థం దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అనంతరం శ్రీమద్రామాయణం ప్రవచనం చేసిన కృష్ణమాచార్యులను ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సత్కరించారు. వారోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక హోమాలు జరిపించారు. కార్యక్రమంలో ఈఓ కిశోర్‌కుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బమ్మిడి వెంకటరమణ, ట్రస్టుబోర్డు సభ్యులు దాట్ల సత్యనారాయణరాజు, దవళ నాగఇందులక్ష్మి, తిరుమురెడ్డి శ్రీనివాసరావు, కంచరాపు రాము, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సేవ చేయడం అభినందనీయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



వృద్ధాశ్రమలో టీవీ రూమ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల కుసుమహర్‌నాథ్ క్షేత్రంలోని వృద్ధాశ్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ట్రస్ట్ సమకూర్చిన టీవీ రూమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, అమెరికా వాస్తవ్యులు వృద్ధులకు 75 ఇంచీల టీవీని, సౌకర్యవంతమైన 40 కుర్చీలను సమకూర్చారన్నారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ, ఎన్‌సీఎస్ ట్రస్ట్ చైర్మన్ నారాయణం శ్రీనివాసరావు మాట్లాడుతూ, కుసుమహర్‌నాథ్ క్షేత్రంలో వృద్ధులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో టీవీ రూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉడతా కాశీ విశ్వనాథం, ఉసిరికాల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా అమ్మ వారి దేవస్థానంలో ఉదయం 11 గంటల నుంచి ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నూతన రోడ్డు ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల , నగర మేయర్, స్థానిక కార్పొరేటర్లు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 32వ డివిజన్‌లో రూ.34 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 32 డివిజన్‌లో గల సిద్ధార్థ నగర్, మౌర్య గార్డెన్స్ ప్రాంతాలలో రూ.34 లక్షలతో నిర్మించిన రహదారులను ఆదివారం ఆయన ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా స్థానిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధి ఉసిరికల ప్రసాద్ మాట్లాడుతూ, తాము కోరిన వెంటనే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు రుణపడి ఉంటామన్నారు. గతంలో తమ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతమయ్యేవారని తెలిపారు. వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులుండేవని చెప్పారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించారన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేసి తమ ప్రాంతాన్ని కాంతిమయం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం రూ.34 లక్షలతో బీటీ రహదారిని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. నగరంలోని అనేక ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రెడ్డి గురుమూర్తి, మారం బాలబ్రహ్మరెడ్డి, పార్టీ నాయకులు భోగాపురపు రవిచంద్ర పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



రక్తదానం చేస్తున్న యువతి

విజయనగరం ఫోర్ట్: యువత రక్తదానానికి ముందుకు రావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో తలసేమియా రోగుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తలసేమియా రోగులకు 15 నుంచి 21 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని తెలిపారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి కాపాడగలడని చెప్పారు. కార్యక్రమంలో శ్రేయరెడ్డి, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెంతకు పాలన



గంట్యాడ: పెదమజ్జిపాలెంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారం
- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



బొండపల్లి: దేవుపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ/ బొండపల్లి: గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేశా రని, పల్లె చెంతకు ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గంట్యాడ మండలంలోని పెద మజ్జిపాలెంలో సచివాలయ నూతన భవనాన్ని, బొండపల్లి మండలంలోని దేవుపల్లి, కనిమెరక గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నూతన భవనాల ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో పరిపాలన సులభతరం అయిందని తెలిపారు. ప్రభుత్వ సేవల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పిందని అన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, సదరం స్లాట్ బుకింగ్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు తదితర 500కు పైగా సేవలు సచివాలయా ల్లోనే లభిస్తున్నాయని చెప్పారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ అన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి, ప్రజలకు సేవలన్నీ ఒకే చోట అందేవిధంగా సీఎం జగన్ ముందు చూపుతో తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇస్తోందన్నారు.

అవినీతి రహిత పాలన

ప్రభుత్వ సేవలు, పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయని ఎమ్మెల్యే అప్పలనరసయ్య అన్నారు. పార్టీల కతీతంగా అర్హులకు పథకాలను మంజూరు చేస్తున్నామని, అవినీతి రహిత పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం జన్మ భూమి కమిటీలు, టీడీపీ నాయకులకు లంచాలు ఇవ్వనిదే ప్రజలకు అందేవి కాదని గుర్తు చేశారు. పెదమజ్జిపాలెంలో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు జలజీవన్ మిషన్ పథకం నుంచి రూ.60 లక్షలు మంజూ రయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని వాటిని సరిచేయాలని గ్రామస్తులు కోరాగా... స్తంభాల ను సరిచేయాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న కుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. పెద్దమజ్జిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, గంట్యాడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధిరామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, పెదమజ్జిపాలెం సర్పంచ్ కొంచా డ సన్యాసినాయుడు, ఎంపీటీసీ ఎర్ర అప్పారావు, గింజేరు సర్పంచ్ రాజాన సూరిబాబు, ఎంపీటీసీ చప్ప ఊహ, తామరపల్లి సర్పంచ్ కొడెల ముత్యాలనాయుడు, నాయకులు ప్రభూజీ, రంభ సత్యారావు, దేవుపల్లి, కనిమెరక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు, బొండపల్లి ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి, కనిమెరక సర్పంచ్ ఎస్.ఆదినారాయణ,దేవుపల్లి ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, నాయకులు మీసాల తులసీరాం బోడసింగి జగదీశ్వరరావు,కర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.